**విజయవాడ** ప్లాట్‌ఫారం చాలా సందడిగా ఉంది. కబుర్లతో కాలాన్ని మింగేస్తున్న అమ్మాయిలూ, వాళ్ళను చూపులతో తినేస్తూ, రైలు ఎంత ఆలస్యమైతే అంత బాగుంటుందనుకునే అబ్బాయిలూ, పిల్లల తల్లులూ, తల్లుల పిల్లలూ.

పట్టుచీరల గరగర మినహా పెళ్ళి పందిరిలా ఉంది.

అంతా సిద్ధమయి, అందరూ ఎదురు చూస్తూంటే కాని మీటింగుకు రాని మినిస్టరులా వచ్చి ఆగింది 'తమిళనాడు ఎక్స్‌ప్రెస్'.

అంతే. ఉరుకులు, పరుగులు.

అందరికన్నా ముందు ఉండాలని అందరి ఆరాటం (కొన్ని ముఖ్య విషయాల్లో తప్ప).

అందరూ ఎక్కాగా తాపీగా ఎక్కాను. రైలు కదిలింది.

సామాను పై బెర్తు మీద ఉంచి, చుట్టూ మనుషులకేసి దృష్టి సారించాను.

ఒక నలభై ఏళ్ళ ఆవిడ ఎదురుగా కూర్చుని ఉంది.

ఒక యువకుడు (నా వయసు వాడే) ఒక తెలుగు పత్రికలో బుర్ర దూర్చి సీరియస్‌గా చదువుతున్నాడు (అతని ముఖం చూస్తూంటే ఆ కథలో హీరోయిన్‌కు ఏదో పెద్ద కష్టమే వచ్చి ఉంటుందనిపించింది).

పక్కకు ఉండే రెండు బెర్తులకేసి దృష్టి సారించాను.

అంతే. దృష్టి వెనక్కు తిప్పలేకపోయాను.

అందమైన అమ్మాయి. అలవోకగా కూర్చుని, కోర పెదవి అంచుల చిరునవ్వుల దోబూచులాడుకొని, కిటికీలోంచి బయటికి చూస్తూంది.

'పాలుగారే నిండులకై వేయి కనులు కావాలి' అనే వాక్యం ఈ అమ్మాయిని గురించే అయి ఉంటుందనిపించింది.

"ఏ వూరు వెడుతున్నావు?" పక్క ఆవిడ ప్రశ్నించింది.

"ఢిల్లీ." (అమ్మయ్య! అనుకున్నాను.)

"అక్కడ మీ వాళ్ళు ఉన్నారా?"

"ఊఁ!"

"పేరేమిటి?"

"శశికళ."

'కాసంత చూసిందంటే కడలే పొంగాలి
పూసంత నవ్విందంటే పున్నమి కావాలి.'

రైలు వేగం పుంజుకుంది.

నా మనసు తుఫాను వేళ సముద్రంలా ఉంది. కాలం కరుగుతూంటే కలల గిలిగిలి పెరుగుతూంది.

* * *

చేతికి మరుక్షణమే సిగరెట్టు తగిలింది.

ఈ లోకంలోకి వచ్చినట్టు చూశాను. రైలు స్లో అవుతూంది. ఏదో స్టేషను వస్తూన్నట్టుంది.

అప్పటిదాకా నా మనసులోని భావాల్ని ప్రింటు చేస్తే ఏదీ రీళ్ళ కలర్ సినిమా అవుతుంది (మూడు ట్యూమెన్లతో సహా).

మళ్ళీ కెమెరా 'స్విచ్ ఆన్' అయింది. షాట్ నం...

రైలు ఆగింది.

అందరూ 'రిలాక్స్' కావడానికి క్రిందికి దిగారు.

'శశికళ' ఖాళీ వాటర్ బాటిల్ పట్టుకుని బేలగా చూస్తూంది.

"ఇటివ్వండి. నే తెస్తాను" అంటూ బాటిల్ అందుకున్నాను.

శశికళ ముఖంలో కొత్త కళ.

దూరంగా ఉన్న కొళాయి దగ్గర నీళ్ళు పట్టాను.

ఇంతలో రైలు కదిలింది.

"కమాన్! క్విక్, డియర్!" గేటు దగ్గర నిలబడి శశికళ అరుస్తూంది. స్టేషన్‌లో సన్నగా తుంపర పడుతూంది. ('మధ్యలో ఇదెందుకు?' మనసు గొణిగింది. 'ష్! నోర్ముయ్యి.')

పరుగెత్తుకుంటూ వెళ్ళి శశికళ అందించిన చేయి పట్టుకొని కదులుతున్న రైలులోకి ఎక్కాను.

"నాకోసం ఎంత పని చేశావు, డియర్!"

శశికళ ముఖంలో కొత్త భావాలు.

ఆ తరవాత తరవాత ఇంకేముంది?" లలాల్లా లాలా...లాలలలలా ..."

హీరోయిన్ డ్రీమ్ సీక్వెన్సులో ఉన్నప్పుడు వెనకాల నించి విలన్ భయంకరంగా నవ్వినట్టు రైలు గట్టిగా కూయడంతో షాట్ 'కట్' అయింది.

ఈ లోకంలోకి వచ్చాను.

రైలు ఆగింది.

అందరూ వాటర్ బాటిల్స్‌తో క్రిందికి దిగారు.

శశికళ ఒకసారి స్టేషన్ వైపు చూసి, మళ్ళీ పుస్తకంలో తల దూర్చింది.

నా ఎదుటి బెర్తు మీద కుర్రవాడు వాటర్ బాటిల్ పట్టుకుని, ముందుకు నడుస్తున్న వాడల్లా వెనక్కు వచ్చాడు.

"మీకు నీళ్ళు తెమ్మంటారా?" 'శశి'ని అడిగాడు.

"అవసరం లేదు ... ఊఁ... సరే, తీసుకురండి" అంటూ బాటిల్ ఇచ్చింది.

వీడు నాకు కాంపిటీషన్ అన్న మాట. సరే, చూస్తాను. అయినా, వీడికి అంత మందిలో నీళ్ళు దొరికినప్పుడు కద! 'మరి నీకైతే అంతమంది లోనూ నీళ్ళు దొరికేయడానికి నువ్వేం తెలుగు సినిమా హీరోవా?' మనసు గొణిగింది. 'ష్! నోర్ముయ్యి.') కానీ, అంతమందినీ తప్పించుకుని రెండు బాటిల్స్‌తో నీళ్ళు తెచ్చాడు.

హీరో చేత తన్నులు తిని పారిపోయి వచ్చిన విలన్‌లా మనసు కుతకుతలాడింది.

కోపంగా నా వాటర్ బాటిల్ తీసి, నేలకేసి కొట్టాను.

అపోజిషన్‌గాడు శశికళకు బాటిల్ ఇచ్చాడు.

"థాంక్స్!" అంది. (జూనియర్ జస్టిస్ ఛీఫ్ జస్టిస్‌గా ప్రమాణస్వీకారం చేస్తే, సీనియర్ మోస్ట్ జస్టిస్ పడే బాధ లాంటిది కలిగింది.)

అపోజిషన్ గాడు మళ్ళీ బెర్తు ఎక్కి పుస్తకంలో తల దూర్చాడు.

రైలు కదిలింది.

* * * *

"మీరు టిక్కెట్లు తీసుకోండి, సార్!" అంటూ టిక్కెట్ కలెక్టరు వస్తున్నాడు.

కెమెరా స్విచ్ ఆన్ ... షాట్ నం ...

అందరూ టిక్కెట్లు తీసుకుంటున్నారు.

శశికళ దేనికోసమో వెతుకుతూంది. ముఖంలో ఆదుర్దా.

"అరె! పర్సు పోయింది. ఇప్పుడెలా? డబ్బంతా అందులోనే ఉంది."

'అమ్మయ్య!' మనసు సంతోషంతో గంతులు వేసింది.

"ఏ దొంగ వెధవో కొట్టేసి ఉంటాడు. (ఆ వెధవకు మెనీ మెనీ థాంక్స్!)" "ఏమోయ్! ఆవిడ కో టిక్కెట్టియ్యి. ఇదిగో, డబ్బు తీసుకో."

శశికళ కళ్ళలో కృతజ్ఞత. 'మీ మేలు జన్మలో మరువలేను.' లలాల్లా లలాల్లా. . .

ఒక 'పంటిపాప' కెవ్వుమని అరిచి ఏడుపు మొదలెట్టింది. షాట్ 'కట్'.

అంతా టిక్కెట్లు తీసుకున్నాము.

"ఖానా చాహియే!" శశికళను అడిగాడు.

'నహీ!' జవాబు.

తాడు పట్టుకొని కొండ ఎక్కుతూంటే, మధ్యలో తాడు తెగినట్టయింది.

* * * *

నేనూ, మా 'అపోజిషన్‌గాడూ' తిన్న శాస్త్రం ముగించాము. శశికళ ఇంకా మాగజైన్లతోటే కడుపు నింపుకుంటూంది. (అయినా వాటిలో ఏముంటుంది? కాస్సేపు నాతో కబుర్లు చెప్పకూడదూ?)

మళ్ళీ ఏదో స్టేషన్ వచ్చింది.

శశికళ మాగజైన్ల పిచ్చి చూస్తే ఒక మంచి ఐడియా వచ్చింది.

గబగబా బండి దిగి వెళ్ళాను, తెలుగు మాగజైన్ ఏదైనా దొరుకుతుందేమోనని.

అదేం కర్మో ఒక్కటికూడా లేదు. అయినా పట్టు వదలని విక్రమార్కుడిలా స్టేషనంతా తిరిగితే ఎడారిలో ఎండమావిలా ఒక షాపులో ఒక పత్రిక కనిపించింది. దాని దగ్గరకి వెళ్ళి నేను తీసుకోబోయేంతలో ఒకాయన ఆ పత్రిక కొనేశాడు. అదే ఆఖరి మాగజైన్.

ఆయన వెంట బడ్డాను. "సార్! మీరే మనుకోక పోతే, ఆ మాగజైన్ నా కిచ్చేస్తారా?"

"ఏం? అట్టమీద బొమ్మ నీ ఫేవరిట్ హీరోయినా?

"అది కాదు, సార్!" నా బాధ ఎలా చెప్పాలో తెలియలేదు.

'వెధవ్వేషాలు వెయ్యకుండా బుద్ధిగా చదువుకో. బాగుపడతావ్!' అన్నట్టు ఒక చూపు చూసి, తన పెట్టె ఎక్కేశాడు. రైలు కదిలింది.

పరుగు పరుగున వెళ్ళి నా పెట్టెలో పడ్డాను.

నా అపోజిషన్‌గాడు శశికళ ఎదురుగా కూర్చున్నాడు

ఒళ్ళు మండిపోయింది. నెమ్మదిగా నా సీట్లోకి చేరాను.

"మీరు మిల్క్ చేయలేదు కదా? ఈ అరటి పళ్ళు తీసుకోండి!"

(వెధవ! వెధవ్వేషాలూ వీడూనూ!)

పంథై ఏళ్ళ ఆవిడకి కూడా ఇచ్చాడు.



# ముఖాముఖి 'నాతో నేను'

—ఐ. శ్రీనివాస శాస్త్రి

అరటిపళ్ళు తిన్నాక, మాగజైన్స్ మార్చుకున్నారు.

వాడు వెళ్ళి వాడి బెర్తు మీద పడుకున్నాడు. శశికళ కొత్త మాగజైన్ సరికొత్త ఉత్సాహంతో చదువుతూంది.

. నీరసం వచ్చేసింది.

నా బెర్తు మీద పడుకుని, దూరంగా కనిపిస్తున్న చీకటిలోకి చూడసాగాను.

• • • •

తెల్లవారింది. లేచేసరికి ఎదురుగా 'సుప్రభాత సుందరి'లా శశికళ.

అప్పోజిషన్‌గాడు ఇంకా లేవలేదు.

ఇంక కొన్ని గంటల్లో ఢిల్లీ చేరతాము.

ఈ కాలానిక ఇంత కంగా రెందుకో! మెల్లగా పడవకూడదూ?

నిమిషాలు సెకండ్లలా గడుస్తున్నాయి.

ఏం చేయాలో తోచక ఎదురుగా ఉన్న మాగజైన్ తీసుకుని చూడసాగాను.

రైలు నిజాముద్దీన్ చేరింది. ఇంకొక అరగంట. ఆఁ— అంతే 'చిగురంత ఆశా జగమంత వెలుగూ'.

షాట్ నం. . .

రైలు ఆగుతూంది. ఎక్కినప్పు డెంత కంగారో దిగినప్పుడూ అంతే. ఒకళ్ళను తోసుకుని ఇంకొకళ్ళు దిగుతున్నారు. 'శశికళ' పెట్టె బెడ్డింగుతో ఎలా దిగాలో తెలియక తికమక పడుతూంది.

"నే పట్టుకుంటా. ఇటివ్వండి." కృతజ్ఞత నిండిన కళ్ళతో శశి వెనక వస్తూంటే రేసు గెలిచిన ఛాంపియన్‌లా ముందుకు నడిచాను.

అప్పోజిషన్‌గాడు పై నుండి కిందికి ఉరికాడు.

షాట్ కట్.

"అరె! మీకు మాగజైన్ తిరగేసి చదవడం వచ్చా?"

"ఆఁ!.. .అహహ!" లోపలినుంచి వస్తున్న కోపాన్ని చిరునవ్వుతో ఆపేశాను.

ముందు తన బెడ్డింగు సర్దాడు.

తరవాత నలభై ఏళ్ళ ఆవిడ బెడ్డింగు సర్దాడు. ఆవిడ ముచ్చట పడి పోతూంది.

ఆ రెండూ తీసుకువెళ్ళి గేటు దగ్గర పెట్టి వచ్చాడు.

వెనక్కు వచ్చి. . . ఆఁ. . . వోరి వీడి అఘాయిత్యంకూలా! శశికళ సూట్‌కేస్‌కూడా తీసుకు పోతున్నాడు.

"అదేమిటండీ! ఎక్కడికి తీసుకు పోతున్నారు?" శశి అడిగింది.

"ఇది తీసుకుని మధ్యలో క్రిందికి ఉరికేయను లెండి!"

శశికళ పకపక నవ్వింది.

లాభం లేదు. అయిపోయింది. అంతా అయి పోయింది. కానీ, వీడి వ్యవహారం చూస్తుంటే 'శశి'ని తన ఆటోలోనే తీసుకుపోయి 'కిడ్నాప్' చేసేలా ఉన్నాడు. ఏమైనా ఆ అమ్మాయిని వీడి కబంధ హస్తాల నుంచి తప్పించాలి.

(గారంటీగా మనకు రావని తెలిసిన వోట్లని అవతలి పార్టీకి పొకుండా చెయ్యాలనుకోవడం తప్పు కాదు కదా?)

ప్యాఢిల్లీ వచ్చింది. మెల్లిగా కిందికి దిగాను.

ఈ లోపల 'అప్పోజిషన్ గాడు' చిన్న రెండు 'టేబిల్ కాన్ఫరెన్స్' పెట్టాడు.

"నీది మంచి మనసు, బాయనా!" నలభై ఏళ్ళ ఆవిడ కామెంట్

"నేను చేసింది ఏముందండీ!" అప్పోజిషన్ సిగ్గు పడుతూంది.

'కొంత మంది ఏమీ చెయ్యకుండానే ఏదో చేసి నట్టు ఫీలవుతారు. మీరు చేసిన సహాయానికి థాంక్స్!' శశికళ పోర్టరుకు సామాను ఇచ్చి, చెయ్యి ఊపి వెళ్ళిపోయింది. (అయితే, విలన్ హీరోయిన్‌ను ఫాలో కావటం లేదన్నమాట. మరి క్లైమాక్స్‌లో 'కార్ రేస్' మాటేమిటి?)

'అప్పోజిషన్ గాడు' ముందుకు వెళ్ళబోయిన వాడల్లా నా కేసి తిరిగి, 'ఓకే! సీయూ ఎగైన్' అని చెయ్యి అందిస్తున్నాడు.

కళ్ళు తిరిగాయి. అంతలోనే గుర్తు వచ్చింది— వాడు నాకు ఆజన్మశత్రువు కాదు కదా, చిన్నరకం శత్రువుకూడా కాదని. వాడు ఆఁ—కాదు. అతని ముఖంలోకి చూశాను.

తనకు ఉన్న వెన్నెల్ని అందరికీ సమంగా పంచి ఇచ్చే చందమామలా ఉన్నాడు.

మరి నా ముఖం. . . అద్దం కనిపించగానే క్రాప్ సరిదిద్దుకునే అలవాటున్న నేను ఎదురుగా గోడకు ఉన్న నిలువు టద్దాన్ని బలవంతాన తప్పించుకొని బయటికి నడిచాను. *

